క్లుప్తంగా

నేటి నుంచి ఏపీజీవీబీ సేవలు నిలిపివేత

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో ఏపీజీవీబీ బ్యాంకు పేరును తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంకుగా జనవరి 1 నుంచి మార్పు చేస్తున్నట్లు బ్యాంకు మేనేజర్ శ్రీకాంత్ తెలిపారు. శనివారం నుంచి వినియోగదారుల సేవలు నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు. అదే విధంగా మొబైల్ బ్యాంకింగ్ ద్వారా ఫోన్‌పేలు, గూగుల్ పే కూడ ఏపీజీవీబీ పేరును తొలగించి టీజీజీవీబీ పేరును మార్పు కోవాలని సూచించారు. ఖాతాదారులు సహకరించాలని కోరారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్దాం



వెల్దండ: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని కల్వకుర్తి అసెంబ్లీ కన్వీనర్ యెన్నం శేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని బైరాపూర్‌లో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ఇంటింట ప్రచారం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. గ్రామ గ్రామాన బీజేపీని బలోపేతం చేద్దామన్నారు. రాబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. అనంతరం 138 బూత్ కమిటీ అధ్యక్షుడిగా కట్ల వెంకటయ్య యాదవ్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో చెన్నోజు మల్లికార్జునచారి, కోడుపూరి శ్రీశైలం, గొల్సం మల్లేష్‌యాదవ్, సీతారాం తదితరులు ఉన్నారు.

కేంద్ర సహాయ మంత్రిని కలిసిన శివకుమార్



కల్వకుర్తిరూరల్: కేంద్ర సహాయ మంత్రి రక్షఖడ్సేను పట్టణానికి చెందిన స్వామి వివేకానంద బృందం అధ్యక్షుడు శివకుమార్ ఢిల్లీలోని శాస్త్రీ భవన్‌లో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సంవిధాన్ సపోర్ట్ బృందం ఆధ్వర్యంలో ఢిల్లీలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా కలిసినట్లు ఆయన తెలిపారు. ఒకే దేశం, ఒకే ఎన్నిక కార్యక్రమంపై సంతకాల సేకరణతో పాటు సేవాబృందం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను కేంద్ర మంత్రికి వివరించినట్లు శివ విలేకరులకు తెలిపారు.

గంధోత్సవ కమిటీ ఏర్పాటు

అమ్రాబాద్: మండల కేంద్రంలోని జామె మసీద్‌లో గంధోత్సవ కమిటీని శుక్రవారం ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా అబ్బాస్, ఉపాధ్యక్షుడిగా అఫ్జల్, ఇస్మాయెల్, కార్యదర్శిగా జహూర్, సహాయ కార్యదర్శిగా కలీమ్, జావేద్‌లతో పాటు మరికొంతమంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. నిరంజన్‌షావలి దర్గా ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలి

ఉప్పునుంతల: మండలంలోని పెద్దాపూర్‌కు చెందిన కొంతమంది అధికార పార్టీకి చెందిన నాయకులు అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఇసుక అక్రమ రవాణాను ప్రోత్సహిస్తున్నారని అదే గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కొత్త రవీందర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వాగు ఒడ్డున ఇసుకను డంపులు చేస్తున్నారని వివరించారు. ఉన్నతాధికారులు విచారణచేసి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని ఆయన కోరారు.

డ్రైయినేజీలో పైపులైన్

లింగాల: మండలంలోని సూరాపూర్ ప్రధాన మార్గంలో పాఠశాల దగ్గర ఉన్న మురుగు కాల్వలో మిషన్ భగీరథ పైపు లైన్ వేయడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పైపు లీకేజీ అయితే తాగునీరు కలుషితం అయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మురుగు కాల్వ నుంచి మిషన్ భగీరథ పైపును తొలగించి సమస్య తలెత్తకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.





కల్వకుర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో..



తాడూరులో..



అచ్చంపేటలో..

మన్మోహన్‌సింగ్‌కు ఘన నివాళి



తిమ్మాజిపేటలో ..



నాగర్‌కర్నూల్ అంబేడ్కర్ చౌరస్తాలో మన్మోహన్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

సాక్షి, నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా మాజీ ప్రధాన మంత్రి, ఆర్థికవేత్త డాక్టర్ మన్మోహన్ సింగ్ మృతిపై పలువురు సంతాపం వ్యక్తం చేస్తూ ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్, బిజినేపల్లి, అచ్చంపేట కొల్లాపూర్, తెలకపల్లి, కల్వకుర్తి, తిమ్మాజిపేట, చారకొండ, పెద్దకొత్తపల్లి, లింగాల, దోమలపెంట, వెల్దండ, ఉప్పునుంతల, మన్ననూరులో నాయకులు నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. దేశం కోసం తీసుకొచ్చిన ఆర్థిక సంస్కరణలను గుర్తు చేసుకున్నారు. ఆర్బీఐ గవర్నర్‌గా, ఆర్థిక శాఖ మంత్రిగా, దేశ ప్రధానిగా దేశానికి ఎనలేని సేవచేశారని వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా మండలాల అధ్యక్షులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



లింగాలలో..



బిజినేపల్లిలో..



పెద్దకొత్తపల్లిలో..

పంచాయతీ కార్మికుల ధర్నా



కొల్లాపూర్‌లో ధర్నాలో కార్మికులు

కొల్లాపూర్: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట శనివారం పంచాయతీ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ మాట్లాడారు. కార్మికులకు ఆరు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని దీంతో వారి బతుకులు దుర్భరంగా మారయన్నారు. కార్మికుల హక్కులు కాలరాసే విధంగా ఉన్న జీఓ నంబర్ 51ని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దుచేయాలన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలన్నారు. సీనియారిటి ప్రాతిపదికన కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు బాలస్వామి, బాలరాజు, వెంకటేష్‌గౌడ్, మధు, నర్సింహ్మ, జానకమ్మ, సాయమ్మ, వెంకటయ్య, చెన్నయ్య తదితరులు ఉన్నారు.

కలెక్టరేట్ ముట్టడికి తరలిరావాలి



అచ్చంపేటలో నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

అచ్చంపేట రూరల్: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం నిర్వహించనున్న కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట గ్రామ పంచాయతీ కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ కార్మికుల పెండింగ్ ఆరు నెలల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, ఈఎస్ఐ ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించాలన్నారు. కార్యక్రమంలో కార్మికులు వేమయ్య, నిరంజన్, కొండయ్య, వెంకట్‌రాములు, సత్యనారాయణ, బాలస్వామి, పద్మ, అంకమ్మ, యశోద, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక



పెద్దకొత్తపల్లి: పెదకారుపాముల గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు బీనమోని లింగస్వామి బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ప్రేమేందర్ రెడ్డి మాట్లాడుతూ బీజేపీతోనే పేదల సంక్షేమం సాధ్యమన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్ రావు, జాతీయ మాజీ ఓబీసీ కమిషన్ సభ్యులు ఆచారి, వెంకటయ్య, విమేష్ రెడ్డి, సాతాని శీను, మేకల శివ, గుండాల శివ, బంటుపల్లి శివ, బి విష్ణు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



వెల్దండ: మండలంలోని చెదురుపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు మందగళ్ల అంజయ్య తల్లి లక్ష్మమ్మ శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందింది. మండల కేంద్రంలో పుట్ట రామస్వామి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ బాధిత కుటుంబాలను పరామర్శించారు. మాజీ ఎంపీపీ పుట్ట రాంరెడ్డి, జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్ కసారపు వెంకటయ్యముదిరాజ్, నాయకులు నిరంజన్, యాదగిరి, మధుసూదన్‌రెడ్డి, లింగంముదిరాజ్, నిరంజన్, నాగేష్, కొండల్‌యాదవ్, తదితరులు ఉన్నారు.

భూమిలేని వారికి రూ.12 వేలు ఇవ్వాలి



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నర్సింహ తదితరులు

నాగర్‌కర్నూల్‌రూరల్: భూమిలేని పేదలకు రూ.12వేలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, నాయకులు నర్సింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం విధివిధానాలను ప్రకటించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివవర్మ, అధ్యక్షుడు వర్ధం సైదులు, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న, రైతు సంఘం నాయకులు బాలస్వామి, సహాయ కార్యదర్శి చింతల నాగరాజు, నందిపేట భాస్కర్, సురేందర్, కాశన్న తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



వెల్దండలో నగదు అందజేస్తున్న నాయకులు

కల్వకుర్తిరూరల్: మండలంలోని పంజుగుల గ్రామానికి చెందిన రాములమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేష్ రూ.3వేలతో పాటు 50 కేజీల బియ్యాన్ని సమకూర్చారు. శుక్రవారం బాధిత కుటుంబానికి తెలంగాణ జాగృతి జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు గణేష్ అందజేశారు. కార్యక్రమంలో తిప్ప సాయిబాబు, శ్రీను, వెంకటయ్య, మహేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వెల్దండ: మండల కేంద్రానికి చెందిన సామ దశరథం ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటున్నాడు. శుక్రవారం సింగల్‌విండో చైర్మన్ జూపల్లి భాస్కర్ రావు సమకూర్చిన రూ.10వేలను బీఆర్‌ఎస్ నాయకులు బాధితుడికి అందజేశారు. మాజీ సర్పంచ్ సాయికుమార్, మాజీ ఉపసర్పంచ్ నిరంజన్, నాయకులు నిరంజన్, ప్రభాకర్, లింగం, చల్లామధుసూదన్‌రెడ్డి, రాములుయాదవ్, ఆనంద్, యాదగిరి, శేఖర్, వెంకటయ్య, నాగయ్య తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

తాడూరు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్ఐ గురుస్వామి తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం మండలంలోని శిర్సవాడకు చెందిన జంగమ్మ, వెంకట్‌నారాయణ దంపతులు ఈ నెల 25న గ్రామం నుంచి నాగర్‌కర్నూల్‌కు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. లచ్చిరామ్ తండా దగ్గర వాహనం అదుపుతప్పడంతో జంగమ్మ(34) కిందపడి గాయపడ్డది. చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి తల్లి రాములమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రేపు మున్నూరు కాపు వివాహ పరిచయ వేదిక

కల్వకుర్తిరూరల్: హైదరాబాద్‌లోని కాచిగూడలో ఉన్న అంజయ్య హాల్‌లో ఈ నెల 29న రాష్ట్ర మున్నూరు మహాసభ సమావేశం నిర్వహిస్తునట్లు ఆ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు మటన్ చక్రపాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో సంఘం కార్యక్రమాలు చర్చించడంతో పాటు వివాహ పరిచయ వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పూజ



కల్వకుర్తిరూరల్: పట్టణంలోని అయ్యప్ప దేవాలయంలో శుక్రవారం అయ్యప్ప మాల ధారులు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాములకు ఆంజనేయులు భిక్ష ఏర్పాటు చేశారు. గురుస్వాముల ఆధ్వర్యంలో భక్తిగీతాలను ఆలపించారు.

అంబులెన్స్‌లో ప్రసవం

అమ్రాబాద్: పదర మండలం ఉడిమిళ్ల గ్రామానికి చెందిన శివలీలకు గురువారం అర్ధరాత్రి పురిటి నొప్పులతో బాధపడుతోంది. కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించడంతో వారు గ్రామానికి చేరుకొని గర్భిణీని అంబులెన్స్‌లో ఎక్కించుకొని ప్రభుత్వ ఆస్పత్రికి బయలుదేరారు. మార్గమధ్యలో పురిటినొప్పులు అధికం కావడంతో ఈఎంటీ శ్రీనివాసులు, పైలెట్ బషీర్‌లు పర్యవేక్షణలో మహిళ ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లిదండ్రులు క్షేమంగా ఉన్నట్లు అంబులెన్స్ సిబ్బంది తెలిపారు. అనంతరం అమ్రాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు



మన్ననూర్: అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు వస్తుందని ప్రిన్సిపాల్ గోవర్ధన్ అన్నారు. శుక్రవారం పీటీజీ పాఠశాల/కళాశాలలో 32 ఏళ్లుగా కిచెన్ హెల్పర్‌గా విధులు నిర్వహించి పదవి విరమణ పొందిన సైదమ్మను ఆయన సన్మానించారు. కాంగ్రెస్ నాయకులు వెంకటరమణ, సత్యనారాయణ, శివాజీ, లక్ష్మీపతి, వైస్ ప్రిన్సిపాల్ పద్మావతి, రాధ, ప్రసంగి, ఆంజనేయులు, ఉదయ్, జైపాల్ పాఠశాల సిబ్బంది, బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

సర్వేకు సహకరించాలి

తెలకపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేకు దరఖాస్తుదారులు సహకరించాలని పంచాయతీ ఈఓ భాస్కర్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 30వ తేదీ వరకు సర్వే కొనసాగుతోందని తెలిపారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారు ఇళ్ల వద్ద అందుబాటులో ఉండాలని కోరారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

కల్వకుర్తి టౌన్: మద్యం తాగి వాహనాలను నడిపిన ఇద్దరికి జడ్జి జరిమానాతో పాటుగా జైలుశిక్ష విధించారు. ఎస్ఐ మాధవరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలో రెండు రోజుల కిందట డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీల్లో ఇద్దరు పట్టుబడ్డారు. మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మరాశిపల్లికి చెందిన శ్రీశైలం, నరేందర్‌లు పట్టుబడగా, శ్రీశైలంకు నాలుగు రోజుల జైలుశిక్ష, నరేందర్‌కు రెండురోజుల శిక్షతో పాటుగా రూ.100 ఫైన్ జడ్జి కావ్య విధించారు.

బూత్ కమిటీ ఎన్నిక



చారకొండ: మండలంలోని చంద్రాయన్‌పల్లిలో శుక్రవారం బీజేపీ మండల అధ్యక్షుడు గజ్జె వెంకటయ్య గౌడ్ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బూత్ కమిటీని ఎన్నుకున్నారు. బూత్ కమిటీ అధ్యక్షుడిగా బాదగోని రామకృష్ణ గౌడ్, ఉపాధ్యక్షుడిగా ఎల్లేటి గెల్వయ్య, డెరంగుల అంజయ్య, ప్రధాన కార్యదర్శి వారణాసి నరేష్, కార్యదర్శి మహేందర్, లక్ష్మయ్య, కొంత మంది సభ్యులతో కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు కొండల్, చిన్న వెంకటయ్య గౌడ్, తదితరులు ఉన్నారు.

ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా శంతన్

అచ్చంపేట రూరల్: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా అచ్చంపేటకు చెందిన మొక్తాల శంతన్‌ను నియమించారు. సిద్దిపేటలో నిర్వహించిన ఏబీవీపీ 43వ రాష్ట్ర మహాసభలలో ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షుడు జానారెడ్డి శంతన్‌ను నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శంతన్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన రాష్ట్ర కార్యవర్గానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. శంతన్ నియామకం పట్ల పలువురు ఏబీవీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

సమస్యల పరిష్కరించాలి

పాన్‌గల్: గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ తీసుకోవాలని, అధికారులు నిర్లక్ష్యం కారణంగానే ప్రజలు దీక్షలు చేయాల్సిన పరిస్థితి నెలకొందని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు, సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని రేమద్దులలో నెలకొన్న స్థానిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రజాసంఘాలు, సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి మూడో రోజుకు చేరింది.

ముగిసిన ‘ఉపాధి’ పనుల సామాజిక తనిఖీ గ్రామసభలు



పాన్‌గల్: మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లో ఈనెల 22వ తేదీ నుంచి నిర్వహించిన ఉపాధి పనుల సామాజిక తనిఖీ గ్రామసభలు శుక్రవారంతో ముగిశాయి. చివరి రోజు మండలంలోని బహదూర్‌గూడెం, తెల్లరాళ్లపల్లి, బుసిరెడ్డిపల్లి, దావాత్‌ఖాన్‌పల్లి, బండపల్లి, చింతకుంట, కొత్తపేట, కిష్టాపూర్‌తండా, శాగాపూర్‌తండా, మాధరావుపల్లి, మంగళ్లపల్లి గ్రామాల్లో 14వ విడత సామాజిక తనిఖీకి సంబంధించి ఏప్రిల్ 2023 నుంచి 31 మార్చి, 2024 వరకు నిర్వహించిన రూ.188.21 లక్షలకు సంబంధించిన పనులు, చేసిన ఖర్చుపై గ్రామ సభలో పనుల వారీగా చర్చించి, అభ్యంతరాలను నమోదు చేసుకున్నట్లు సామాజిక తనిఖీ సిబ్బంది పేర్కొన్నారు.

నేడు పాన్‌గల్‌లో ప్రజావేదిక

మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో 14వ విడత సామాజిక తనిఖీకి సంబంధించి శనివారం ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఏపీఓ కుర్మయ్య శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఓటీఎస్ మేళాను వినియోగించుకోండి

వీపనగండ్ల: మండల కేంద్రంలోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు ద్వారా రుణాలు తీసుకుని దీర్ఘకాలికంగా చెల్లించని వారు ప్రత్యేక వన్ టైం సెటిల్‌మెంట్ స్కీం ద్వారా రుణ విముక్తులు అయ్యే వెసులుబాటు ఉందని, అవకాశాన్ని ఖాతాదారులు వినియోగించుకోవాలని బ్యాంకు మేనేజర్ రవీందర్‌బాబు కోరారు. ఈ నెల 30, 31వ తేదీన మేళాను నిర్వహిస్తున్నామని, పైప్‌లైన్, ముద్ర, వ్యక్తిగత రుణాలు, తీసుకున్న వారు మేళాలో పాల్గొని వెసులుబాటును వినియోగించుకోవాలన్నారు.

కేజీబీవీని తనిఖీ చేసిన అధికారులు

కల్వకుర్తి: మండల కేంద్రంలోని కల్వకుర్తి, ఊర్కొండ కస్తూర్బాగాంధీ విద్యాలయాలను సమగ్రశిక్షా అభియాన్ జిల్లా గణాంక అధికారి మధుసూదన్ రెడ్డి తనిఖీ చేశారు. శుక్రవారం కేజీబీవీల జిల్లా అధికారి శోభారాణితో కలిసి ఆయన పరిశీలించారు. పది, ఇంటర్ పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలో మెళకువలను అందించారు. విద్యార్థులకు పాఠాలను బోధించారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, విద్యార్థినులు అనారోగ్యానికి గురైతే వారికి మెరుగైన వైద్యం అందించాలని, వ్యాధులకు గురైన విద్యార్థుల వివరాలు రిజిస్టర్‌లో విధిగా నమోదు చేయాలని సూచించారు. కేజీబీవీలలో ఉన్న వంటగది, నిల్వ ఉన్న సరుకులను పలు రికార్డులను పరిశీలించారు.

మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ



లీకేజీ నీటితో చేతులు, కాళ్లు శుభ్రం చేసుకుంటున్న కూలీలు

తాడూరు: మండల కేంద్రంలో మిషన్ భగీరథ పైపులైన్ ప్రధాన రోడ్డు పోలీస్‌స్టేషన్ సమీపంలో లీకేజీ అయి రోడ్డుపై నీరు ప్రవహిస్తోంది. లీకేజీ అయిన నీరు రోడ్డుపై ప్రవహిస్తుండటంతో వాహనాల రాకపోకల కారణంగా రోడ్డు గుంతలమయంగా మారింది. దాదాపు నెల రోజుల నుంచి లీకేజీ అవుతున్నా అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. లీకేజీ అయిన నీటి దగ్గర రోడ్డు వెంట వెళ్లే వ్యక్తులు చేతులు, కాళ్లు కడుక్కోవడంతో పాటు అపరిశుభ్రమైన పనులకు కూడా పాల్పడుతున్నారు. ప్రతిరోజు మండల స్థాయి అధికారులతో పాటు జిల్లా స్థాయి అధికారులు వెళ్తున్నా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లీకేజీకి మరమ్మతు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

టీబీ వ్యాధి నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

పాన్‌గల్: మండలంలోని గోప్లాపూర్, గోప్లాపూర్‌తండాలో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో టీబీ వ్యాధి నివారణపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య మాట్లాడారు. రెండు వారాలకు మించి ఎడతెరపి లేకుండా దగ్గు, జ్వరం, తెమడలో రక్తం పడటం, అలసట లేదా నీరసం, రాత్రి పూట చెమటలు పట్టడం, స్వల్ప కాలంలో బరువు తగ్గడం, శారీరక ఆరోగ్యంలో ఆకస్మిక మార్పులు, ఏదైనా శరీర భాగంలో లింపు గ్రంథుల వాపు, ఛాతి ఎక్స్‌రేలో అసాధారణ మచ్చలు కనిపించడం వంటి లక్షణాలు ఉంటే వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ వ్యాధి జుట్టు, గోళ్ల మినహా శరీరంలోని అన్ని అవయవాలకు వ్యాపిస్తుందన్నారు. ఎక్కువగా ఊపిరితిత్తులు, పేగులు, ఎముకలు, మూత్రపిండాలు, మెదడు, వెన్నముకకు వ్యాధి వ్యాపిస్తుందని వివరించారు. వ్యాధి సోకిన వారు క్రమం తప్పకుండా మందులు వాడితే రోగం నయమవుతుందన్నారు. వీరికి నిక్షయ్ పోషణ్ యోజన పథకం ద్వారా బలవర్ధక పోషకాహారాన్ని తీసుకునేందుకు ప్రతి నెల రూ.500 పారితోషకం అందజేస్తారని తెలిపారు. అనుమానితుల నుంచి పరీక్ష నిమిత్తం తెమడను సేకరించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు సతీష్‌కుమార్, నర్సమ్మ పాల్గొన్నారు.